క్లుప్తంగా

మహిళా పోలీస్ సంఘ కోశాధికారిగా వరలక్ష్మి



మైలవరం: రాష్ట్ర సచివాలయ మహిళా పోలీస్ అసోసియేషన్ కోశాధికారిగా మైలవరానికి చెందిన వేముల వరలక్ష్మి ఎంపికయ్యారు. మైలవరంలోని గ్రామ సచివాలయం-5లో మహిళా పోలీస్‌గా వరలక్ష్మి విధులు నిర్వహిస్తున్నారు. విజయవాడలో ఇటీవల జరిగిన రాష్ట్ర సచివాలయ మహిళా పోలీసుల సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర కమిటీని బుధవారం ఎన్నుకున్నారు.

వైఎస్సార్ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడిగా గంగాధరరావు



మైలవరం: వైఎస్సార్ రైతు విభాగం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడిగా జొన్నలగడ్డ గంగాధరరావు నియమితులైనట్లు పార్టీ కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. మైలవరం మండలం చంద్రాల గ్రామానికి చెందిన జొన్నలగడ్డ గంగాధరరావు తొలి నుంచి పార్టీలో తనవంతుగా పని చేస్తూ చంద్రాల గ్రామంలో పార్టీ అభివృద్ధికి విశేషంగా కృషి చేశారు. తనకు పదవి ఇచ్చినందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్‌కు ధన్యవాదాలు తెలిపారు.

ఫైర్ ప్రివెంటివ్ సిలిండర్ల సరఫరా

తిరువూరు: మండలంలోని పాఠశాలల్లో అగ్ని ప్రమాదాల నిరోధానికి ఫైర్ ప్రివెంటివ్ సిలిండర్లను ఉచితంగా సరఫరా చేశారు. 24 పాఠశాలలకు తొలివిడతగా 38 సిలిండర్లను అందజేసినట్లు ఎంఈఓ సోమశేఖరనాయక్ తెలిపారు. వీటిలో ప్రాథమిక పాఠశాలలకు ఒక్కొక్కటి చొప్పున, ప్రాథమికోన్నత పాఠశాలలకు రెండు చొప్పున అందజేసినట్లు ఎంఈఓ పేర్కొన్నారు.

యువకుడు ఆత్మహత్యాయత్నం

మైలవరం: వివాహేతర సంబంధం బయట పెడతారన్న భయంతో మైలవరం దేవుని చెరువుకు చెందిన యువకుడు మాదు మనోహర్ తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి పెట్టుకుని బుధవారం రాత్రి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మైలవరం దేవుని చెరువుకు చెందిన మాదు మనోహర్ అదే ప్రాంతానికి చెందిన వివాహితతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. మహిళ తన భర్తను వదిలేసి వస్తానంటే వద్దని మనోహర్ చెప్పడంతో ఆత్మహత్యకు పాల్పడింది. మహిళ మరణానంతరం అక్రమ సంబంధం విషయం బయటికి రవడంతో మనోహర్‌కు మూడు నెలలు జైలు శిక్ష పడింది. జైలు నుంచి విడుదలై వచ్చిన నిందితుడు పొలం పనులుకు వెళుతున్నాడు. మృతి చెందిన మహిళతో సన్నిహితంగా ఉన్న వీడియోను బయట పెడతామని ముగ్గురు వ్యక్తులు తనను బెదిరిస్తున్నారంటూ చెబుతూ సెల్ఫీ వీడియో రికార్డు చేసి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు అతడ్ని మైలవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్య కోసం గొల్లపూడిలోని ఆంధ్రా ఆస్పత్రిలో చేర్పించారు. బాధితుని తల్లి విజయవాడ భవానీపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

కేడీసీసీబీ పథకాలపై కళాజాత

నూజివీడు: రైతులకు ఇచ్చే కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు వ్యవసాయ రుణాలు, ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, నగదు రహిత లావాదేవీలు, సైబర్ నేరాలు తదితర అంశాలపై నూజివీడు మండలం మొర్సపూడిలో గురువారం కళాజాత ప్రదర్శించారు. కేడీసీసీబీ నూజివీడు బీఎం క్రాంతిసుధ, సూపర్‌వైజర్ ఏసుదాసు, సొసైటీ అధ్యక్షు దురాజు, సెక్రటరీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం

ఆర్లపాడు(గంపలగూడెం): మండలంలోని ఆర్లపాడులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా గురువారం గ్రామస్తుడు జొన్నలగడ్డ రమేష్‌కు చెందిన పూరిల్లు దగ్ధమైంది. రూ.1.5లక్షల విలువ చేసే సామాన్లు తగలబడిపోయాయి. వీఆర్వో ఏ మూర్తి తహసీల్దార్ కార్యాలయానికి నివేదిక ఇచ్చారు. ఎంపీడీఓ పిచ్చిరెడ్డి కాలిపోయిన ఇంటిని పరిశీలించారు.

స్వచ్ఛ భారత్ పితామహుడు గాడ్గేను ఆదర్శంగా తీసుకోవాలి

మైలవరం: స్వచ్ఛ భారత్ పితామహుడు సత్ గాడ్గే బాబాను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ చేతి వృత్తిదారుల సమైక్య ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్ధవరపు వెంకట్రావు తెలిపారు. సత్ గాడ్గే బాబా జయంతి కార్యక్రమాన్ని మైలవరం రజక సంఘం ఆధ్వర్యంలో స్థానిక సెంటర్‌లోని అతిథి గృహం ప్రాంగణంలో గురువారం ఘనంగా నిర్వహించారు. గాడ్గే చిత్రపటానికి వెంకట్రావు పూలమాల వేసి నివాళులర్పించారు. మైలవరం రజక జన సేవ సంఘం నాయకులు రాధాకృష్ణ, శేషగిరిరావు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులపై విచారణ

చింతలపాడు(తిరువూరు): చింతలపాడులో స్థల వివాదం నేపథ్యంలో స్పందనలో గత సోమవారం వచ్చిన ఫిర్యాదులను గురువారం తహసీల్దారు సురేష్‌బాబు, ఎంపీడీఓ నాగేశ్వరరావు విచారించారు. గ్రామంలో నెలకొన్న స్థల వివాదంలో ఫిర్యాదితో పాటు స్థానికులను విచారించినట్లు తహసీల్దారు తెలిపారు.

కాపుసారాకు 'చెక్'

- విస్తృత దాడులతో నిలిచిపోయిన సారా తయారీ
- ప్రత్యామ్నాయ ఉపాధి పొందుతున్న తయారీదారులు



సారా తయారీదారుల్లో పరివర్తన అనంతరం కుట్టుమిషన్లు అందజేసిన ఎస్ఈబీ అధికారులు

తిరువూరు: పేదల ప్రాణాలు హరించే కాపుసారా తయారీ, అమ్మకాలను నియంత్రించేందుకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో జరుపుతున్న దాడులు సత్ఫలితాలిస్తున్నాయి. తిరువూరు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో గత రెండు సంవత్సరాల్లో కాపుసారా తయారీ, అమ్మకందారుల సంఖ్య గణనీయంగా తగ్గింది. నిరంతర దాడులతో గిరిజన తండాలలో సారా తయారీదారులు ఇతర వృత్తులను ఎంచుకున్నారు. ఇంకా అతి తక్కువ మంది కాపుసారా తయారీ, అమ్మకాలనే జీవనోపాధిగా ఎంచుకున్నప్పటికీ స్థానికుల సహాయ నిరాకరణతో చాటుమాటుగానే ఈ వ్యవహారం సాగిస్తున్నారు. తిరువూరు, గంపలగూడెం మండలాల్లో సారా తయారీ పూర్తిగా నిలిచిపోగా, ఏకొండూరు, విస్సన్నపేట మండలాల్లోని ఆరు గ్రామాల్లో మాత్రమే కొద్దిపాటి తయారీ జరుగుతోంది. గతంలో లక్షలాది రూపాయలు చేతులు మారినా కాపుసారా పరిశ్రమ నేడు నామమాత్రంగా ఉంది.

బెల్లం, పటిక అమ్మకందారులపై నిఘా

కాపుసారా తయారీకి అవసరమయ్యే బెల్లం, పటిక అమ్మకందారులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నిఘా ఉంచడంతో సారా తయారీదారులకు ఇవి అందని పరిస్థితి నెలకొంది. సారా విక్రేతలకు బెల్లం, పటిక అమ్మితే కఠినశిక్షకు గురవుతారని అధికారులు చేసిన హెచ్చరికలతో వ్యాపారులు వీటి అమ్మకాలకు స్వస్తి పలికారు. ఇటీవల ఇద్దరు వ్యాపారులపై పీడీ చట్టం కూడా ప్రయోగించడంతో సారా తయారీకి పూర్తిగా బెల్లం అమ్మకాల సరఫరా నిలిపివేశారు.

ప్రత్యామ్నాయ ఉపాధికి మొగ్గు

సారా తయారీ మానేస్తే ప్రత్యామ్నాయ ఉపాధి పథకాలు మంజూరు చేస్తామని ఎస్ఈబీ అధికారులు పలుమార్లు కౌన్సెలింగ్ ఇవ్వడంతో గిరిజన తండాల్లో సమగ్ర మార్పు వచ్చింది. ఇప్పటివరకు ఎస్ఈబీ అధికారులు 16 కుటుంబాల్లోని మహిళలకు కుట్టుమిషన్లు ఉచితంగా పంపిణీ చేశారు. కొందరు సారా తయారీపై ఆధారపడినవారు ఇప్పుడు పొలాలను కౌలుకు తీసుకుని సాగు చేసి జీవనోపాధి పొందుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. విస్సన్నపేట మండలంలోని చంద్రుపట్ల, తెల్లదేవరపల్లి, తాతకుంట్ల, వేమిరెడ్డిపల్లి తండాలలో మాత్రమే సారా తయారీ జరుగుతుండటంతో ఎస్ఈబీ అధికారులు అక్కడ పరిస్థితిలో మార్పు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఏకొండూరు మండలంలోని రేపూడి తండా, పార్తియా తండా, మీట్యా తండా, గొల్లమందల తండా, చీమలపాడు తండాలలో కొన్ని కుటుంబాలు సారా అమ్మకాలు కొనసాగిస్తున్నారు.

80శాతం మార్పు

> గతంలో కాపుసారా అమ్మకం, తయారీపై ఆధారపడిన వారిలో 80శాతం పూర్తిగా పరివర్తన చెందారు. ప్రత్యామ్నాయ ఉపాధి ఎంచుకుని సారా తయారీకి స్వస్తి పలికారు. సారా తయారీకి బెల్లం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యాపారులను హెచ్చరించాం.
>
> – గురవయ్య, ఎస్ఈబీ సీఐ, తిరువూరు

ఈనాడు తప్పుడు రాతలను మానుకోవాలి



ఈనాడు ప్రతులను దగ్ధం చేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

విస్సన్నపేట: ఈనాడు దినపత్రికలో తప్పుడు రాతలు రాయడం మానుకోవాలని ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి అన్నారు. పాత ఫొటోలు పెట్టి ఇప్పుడేదో జరిగినట్లు అసత్యపు వార్తలు రాయడాన్ని ఖండిస్తూ ఎమ్మెల్యేతో పాటు వైఎస్సార్ సీపీ నాయకుల ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో గురువారం ఈనాడు దినపత్రికను దగ్ధం చేశారు. పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే కావాలనే ప్రభుత్వంపై లేనిపోని తప్పుడు వార్తలు రాస్తున్నారన్నారు. ఇటువంటి తప్పుడు రాతలు మానుకోవాలని ఎమ్మెల్యే అన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు లోకేశ్వరరెడ్డి, ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, సర్పంచ్‌లు నాగమల్లేశ్వరి, దేశిరెడ్డి రమ, విజయకుమారి, వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు గద్దల మల్లయ్య, తిరుపతిరావు, చాట్ల మణి, సచివాలయాల కన్వీనర్లు, గృహసారథుల మండల కన్వీనర్ అనుమోలు శివబాజీ, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు నెక్కళపు కుటుంబరావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

ఇబ్రహీంపట్నం: స్థానిక సెవెంత్‌డే ఎడ్వంటిస్ట్ పాఠశాలలో నిమ్రా వైద్యశాల, కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. విద్యార్థులకు కంటి, చర్మవ్యాధులు, సాధారణ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రొఫెసర్ డాక్టర్ వినయ్ బాబు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్యామలాదేవి, డైరెక్టర్ బాబు లాల్ పాల్గొన్నారు.

గన్నీసంచుల పంపిణీ

ముష్టికుంట్ల(తిరువూరు): మండలంలోని ముష్టికుంట్ల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలోని సభ్యులైన రైతులకు పర్యావరణ పరిరక్షణ చర్యల్లో భాగంగా గన్నీ సంచులను గురువారం పంపిణీ చేశారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సరఫరా చేసిన ఈ సంచులను పీఏసీఎస్ చైర్‌పర్సన్ బండి రవికుమార్ రైతులకు అందజేశారు.

హామీలకు మించి సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే రక్షణనిధి



చిన్నారిని ఎత్తుకొని సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

పుట్రేల (విస్సన్నపేట): ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలకు మించి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణ నిధి అన్నారు. మండలంలోని పుట్రేల గ్రామ సచివాలయం-2 పరిధిలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తూ స్థానిక సమస్యలను ఎమ్మెల్యే తెలుసుకున్నారు. గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయని సంక్షేమ పథకాలను పార్టీలకతీతంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. తొలుత రామానగరంలో మహిళలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఏఎంసీ మాజీ చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి, విస్సన్నపేట, తిరువూరు జెడ్పీటీసీ సభ్యులు బీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, రామచంద్రారెడ్డి, ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, పుట్రేల, విస్సన్నపేట సర్పంచ్‌లు స్వాతి, నాగమల్లేశ్వరి, గ్రామ ప్రముఖుడు ప్రతాపరెడ్డి, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ రాణి, సొసైటీ అధ్యక్షుడు బి.సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

ట్యాంకర్లతో నీటి సరఫరా

తిరువూరు: రక్షితమంచినీటి సరఫరా పైపులైన్లు పగిలిపోవడంతో తిరువూరు పట్టణంలోని ఆవాస ప్రాంతాలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్లు నగర పంచాయతీ అధికారులు గురువారం తెలిపారు. అవసరమైన వార్డుల్లో సచివాలయ సిబ్బంది పర్యవేక్షణలో ట్యాంకర్లతో తాగునీరందిస్తున్నామని, పైపులైన్ల మరమ్మతు పనులు త్వరితగతిన పూర్తి చేస్తామని వెల్లడించారు. కమిషనర్ బాలకృష్ణ పగిలిన పైపులైన్లను పరిశీలించి మరమ్మతు పనులను పర్యవేక్షించారు.

గృహసారథులే రథసారథులు

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు

నూజివీడు: గృహసారథులు తమ పరిధిలోని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు కోరారు. నూజివీడు పట్టణంలోని గృహసారథులకు, సచివాలయ కన్వీనర్లకు గురువారం ఎమ్మెల్యే స్థానిక కార్యాలయ ఆవరణలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాబోయే ఎన్నికలకు గృహసారథులే రథసారథులన్నారు. వైఎస్సార్ సీపీ మరింత బలోపేతానికి ప్రతిఒక్కరూ సైనికుల్లా పనిచేయాలన్నారు. సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల గుండెల్లో గూడు కట్టుకొని ఉన్నారని చెప్పారు. రాబోయే 30 ఏళ్లు జగన్‌మోహన్‌రెడ్డే ముఖ్యమంత్రిగా ఉంటారన్నారు. రాబోయే ఎన్నికల్లో సింగిల్‌గానే బరిలోకి దిగుతానని ప్రకటించిన దమ్మున్న నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, గృహసారథుల మండల కన్వీనర్ గుడిమళ్ల రామస్వామి, పట్టణ కన్వీనర్ పిల్లా చరణ్ ప్రసంగించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ మద్దిరాల కోటమ్మ, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు లాం ప్రసాదరావు, నాయకులు యూనస్‌పాషా (గబ్బర్) పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో టీచర్‌కు గాయాలు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి జెడ్పీ బాలికల పాఠశాల వద్ద 30వ నంబర్ జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయురాలు సుజాత తీవ్రంగా గాయపడ్డారు. పాఠశాలకు వెళ్లేందుకు ఆటో దిగి రోడ్డు దాటేందుకు పక్కన నిల్చున్న ఆమెను వేగంగా దూసుకొచ్చిన బుల్లెట్ వాహనదారుడు ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆమె తలకు తీవ్ర గాయమైంది. గాయపడిన ఆమెను తోటి ఉపాధ్యాయులు 108 లో గొల్లపూడిలో ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

సంక్షిప్తం

విచారణకు హాజరైన హాస్టల్ అధికారులు

ఇబ్రహీంపట్నం: అనకాపల్లి జిల్లా ఎస్ రామవరం మండలం లింగరాజుపాలెంలోని బీసీ హాస్టల్ అధికారులు ఇబ్రహీంపట్నంలోని ఆంధ్రప్రదేశ్ స్కూల్ ఎడ్యుకేషన్ మోనటరింగ్ కమిషన్ చైర్మన్ జస్టిస్ ఏ రామలింగేశ్వరరావు ఎదుట గురువారం హాజరయ్యారు. బీసీ విద్యార్థినుల హాస్టల్ సమస్యపై ఈ నెల 16న సామాజిక మాధ్యమాల్లో వీడియో వైరల్ అయిన సంఘటనలో సుమోటోగా విచారణకు స్వీకరించి కమిషన్ హాజరుకావాలని అధికారులను ఆదేశించింది. ఈ నేపథ్యంలో సస్పెండ్ అయిన అధికారులు వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇచ్చుకున్నారు. హాస్టల్ బాలికలను కూడా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారించారు. ప్రస్తుత పరిస్థితులపై ఆరా తీశారు. పూర్తి నివేదిక వారం రోజుల్లో ఇవ్వాలని ఆదేశించారు.

బలివేలో కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులు

ముసునూరు: శివరాత్రి మహోత్సవాల ముగింపు తర్వాత నుంచి బలివేలోని రామలింగేశ్వర ఆలయంలో పారిశుద్ధ్య పనులు కొనసాగుతున్నాయి. ఆలయ ఈఓ విశ్వేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి యోహాన్ ఆధ్వర్యంలో గురువారం స్వామి ఆలయం, రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయం, బాహ్య లింగం, నాగేంద్ర స్వామి పుట్ట, ఆలయ సంబంధిత ధర్మ సత్రాలు, తాత్కాలిక పోలీస్ ఔట్ పోస్ట్ భవనాలను శుభ్రం చేయించి, క్లోరినేషన్ చేశారు. దేవదాయ శాఖ సిబ్బంది, గ్రామ వలంటీర్లు, సచివాలయ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

200 యూనిట్లు దాటితే రాయితీ వర్తించదు

నూజివీడు: విద్యుత్ వినియోగదారులు తమ విద్యుత్ బిల్లులను సకాలంలో చెల్లించాలని ఏపీసీపీడీసీఎల్ ఈఈ డి.కృష్ణనాయక్ పేర్కొన్నారు. స్థానిక అన్నవరంలో గురువారం విద్యుత్‌బిల్లుల చెల్లింపుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యుత్ బిల్లులు ఇచ్చిన 14 రోజుల లోపు చెల్లిస్తే అపరాధ రుసుం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ వినియోగదారులు నెలకు 200లోపు యూనిట్లు వాడితేనే రాయితీ వర్తిస్తుందని, 200 యూనిట్ల దాటి విద్యుత్‌ను వాడినట్లయితే ప్రభుత్వ రాయితీ వర్తించదని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజినీర్ త్రిమూర్తులు, ఈఆర్వో కార్యాలయ ఏఏఓ ప్రసాద్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

ముసునూరు: అనారోగ్యం, ప్రమాదాల బారినపడి సొసైటీ సభ్యులు మృతి చెందితే తమ సంఘం తక్షణ సాయం చేసి ఆ కుటుంబాన్ని ఆదుకుంటుందని చింతలవల్లి వ్యవసాయ సొసైటీ అధ్యక్షుడు నాగళ్ల వెంకటేశ్వరరరావు అన్నారు. బుధవారం మృతి చెందిన సంఘ సభ్యుడు నల్లిబోయిన వెంకటేశ్వరరావు (అక్కిరెడ్డిగూడెం) కుటుంబానికి సహకార సంఘం, కేడీసీసీ బ్యాంకు తరపున రూ.10 వేల సాయం అంతిమ సంస్కారాల కోసం గురువారం కుమారుడు కోటేశ్వరరావుకు అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ ఉలాస రామారావు, సర్పంచ్ పులిబక్ష లక్ష్మీ సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అలసత్వం వహిస్తే క్రమశిక్షణ చర్యలు

ఇబ్రహీంపట్నం: పాఠశాలల నిర్వాహణ, విద్యా బోధనలో అలసత్వం వహిస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని జిల్లా సమగ్రశిక్షా అభియాన్ అడిషనల్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ జి.మహేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక విద్యావనరుల కేంద్రాన్ని గురువారం తనిఖీ చేశారు. వివిధ రకాల రికార్డులు పరిశీలించారు. ఏఎంఓ సురేష్‌కుమార్, సీఎంఓ రాంబాబు పాల్గొన్నారు.

వారంలోగా ఓటర్ల జాబితా సవరణ పూర్తిచేయాలి

తిరువూరు: పెండింగ్‌లో ఉన్న ఓటర్ల జాబితా సవరణ క్లయిములను వారంలోగా పరిష్కరించాలని తిరువూరు తహసీల్దారు సురేష్‌బాబు బీఎల్ఓలను ఆదేశించారు. తహసీల్దారు కార్యాలయంలో నిర్వహించిన బీఎల్ఓల సమావేశంలో ఆయన గురువారం మాట్లాడారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మృతిచెందిన ఓటర్ల తొలగింపు, డూప్లికేట్ ఓటర్ల గుర్తింపు, కొత్త ఓటర్ల చేర్పింపు, జాబితాలో సవరణల వంటి క్లయిములను బీఎల్ఓలు త్వరితగతిన పరిశీలించాలని తెలిపారు.

డయాలసిస్ పేషెంట్లకు పింఛన్‌తో పాటు మందుల పంపిణీ

విస్సన్నపేట: డయాలసిస్ పేషెంట్లకు పింఛనుతో పాటు అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి అన్నారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో ఎంపీపీ పిల్లి మెర్సీ వనజాక్షి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో అధికారులతో కలసి తిరుగుతున్న సమయంలోనే గ్రామస్తులు కొన్ని సమస్యలు తమ దృష్టికి తీసుకొచ్చిన వెంటనే పరిష్కరించే చర్యలు తీసుకుంటున్నామన్నారు. వ్యవసాయ మోటార్లు ఏర్పాటుకు అవసరమైన విద్యుత్ స్తంభాలు త్వరలో ఏర్పాటు చేయిస్తామన్నారు.